# సరస్వతీదేవికి ప్రీతిపాత్రం 'పొన్నపువ్వు'

జె. వేణిమాధవి
నేచురలిస్ట్
www.vedicvanas.com



## సరస్వతీ వనం



సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి ।
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా॥
సరస్వతి నమస్తుభ్యం సర్వదేవి నమో నమః॥
శాంతరూపే శశిధరే సర్వయోగే నమో నమః॥

గత రెండు సంచికల నుండి సరస్వతీదేవికి అత్యంత ప్రీతిపాత్రమైన పుష్పాల్లో ఒకటైన పొన్నవృక్షం గురించి తెలుసుకుంటున్నాం. వివిధ దేవాలయాల్లో స్థలవృక్షంగా వున్న పొన్న చెట్టు విశేషాలను చూస్తున్నాం. ఈ సంచికలో కూడా మరిన్ని విశేషాలను చూద్దాం.

### శ్రీ కపాలేశ్వర్ దేవాలయం, మైలాపూర్, చెన్నై

చెన్నై నగరంలో వున్న ఈ పురాతన దేవాలయంలోని పొన్నచెట్టు కోరికలను తీర్చే స్థలవృక్షంగా పూజలందుకొంటోంది.

**స్థలపురాణం :** ఒకప్పుడు పార్వతీదేవికి గురువైన పరమేశ్వరుడు ఆమెకు జ్ఞానబోధ చేస్తుండగా, ఆమె అటుగా వెళుతున్న నెమలిని చూసి క్షణకాలం పాటు తన ఏకాగ్రతను కోల్పోయింది. దానికి ఆగ్రహించిన శివుడు శపించగా ఆమె నెమలిగా మారింది. క్షమించమని అడిగిన ఆమెకు శివుడు పొన్నచెట్టు కింద శివలింగ రూపంలో వెల సిన తనని పూజించినపుడు ఆమెకు



శాపవిమోచనం అవుతుందని సెలవిస్తాడు. కొంతకాలానంతరం నెమలి రూపంలో వున్న పార్వతీ దేవికి, ప్రస్తుతం చెన్నై ప్రాంతంలో పొన్నచెట్టు కింద వున్న ప్రస్తుత విగ్రహం కనిపించింది. నెమలి రూపంలో వున్న ఆమె ప్రతినిత్యం పువ్వులు తెచ్చి శివుని పూజించి, తపస్సు చేయగా ఆమె భక్తిశ్రద్ధలకు మెచ్చిన శివుడు దర్శనమిచ్చి ఆమెకు శాపవిమోచనం కలిగించాడు. అప్పటినుంచి ఈ ప్రాంతానికి 'మైలాపూర్' అనే పేరు సార్థకమైంది. తమిళంలో 'మైయల్' అంటే నెమలి అని అర్థం.





ఇక్కడి శివుడి పేరు కపాలేశ్వరుడు. ఒకప్పుడు కైలాస పర్వతానికి వెళ్ళిన బ్రహ్మదేవుడు, అహంకారంతో శివుడిని తగు రీతిలో గౌరవించక పోవడం చేత అతడు బ్రహ్మదేవుని నాలుగు శిరస్సుల్లో ఒకదానిని తొలగిస్తాడు. అప్పుడు బ్రహ్మదేవుడు తన తప్పిదాన్ని తెలుసుకొని శివుని శాంతింపచేయుటకు దక్షిణానికి వచ్చి మైలాపూర్ ప్రాంతంలోని ఒక పొన్నచెట్టు కింద శివుని ప్రతిష్ఠించి పూజించాడు. ఈ ప్రాంతాన్ని 'శుక్రపూరి', 'వేదపూరి' అని కూడా పురాణాల్లో ప్రస్తావించడం జరి గింది. ఇక్కడి శివుడిని 'కపాలేశ్వరుడు', 'పున్నైవన నాదార్' అని, అమ్మవారిని 'కార్పగంబాళ్' (కల్పవృక్ష తల్లి) అన్న పేర్లతో పిలుస్తారు.



## స్థల విశిష్టతలు



ఈ క్షేత్రంలోనే శ్రీ బాల మురుగన్, అసుర సంహారం కోసం తన ఆయుధమైన 'వేల్' అంటే శూలాన్ని పార్వతీదేవి నుంచి పొందడం జరిగింది.

వాయిల్ నయనార్ అనే శివభక్తుడు ఇక్కడి శివుడ్ని ఆరాధించి మోక్షం పొందాడు.



తిరుక్కురల్‌ను రచించిన తిరువాళ్ళువార్ యొక్క జన్మస్థానం మైలాపూర్.





ఈయన కన్యాకుమారి మరియు మదురై ప్రాంతాల్లో జన్మించినట్లు వాదనలు వున్నాయి. కానీ ఏదీ స్పష్టమైన ఆధారాలతో నిరూపించ బడలేదు.



నాల్గు వేదాలు కూడా కపాలేశ్వ రుడ్ని పూజించి నట్లు పురాణ ప్రశస్తి.



శివనేశ చెట్టియార్ కుమార్తె అయిన పూంపావై, అడవిలో పువ్వులు సేకరించ డానికి వెళ్లి పాముకాటు వల్ల తనువు చాలిస్తుంది. ఆ పిదప కొంతకాలానికి మైలా పూర్ సందర్శించిన తిరు జ్ఞాన సంబందార్‌ను ఆమె తల్లిదండ్రులు పూంపావైను బ్రతికించమని వేడుకోగా పరమ దయాళువైన అతడు ఆమె కథ విని చలించిపోయి ఇక్కడి శివుణ్ణి ఆశువుగా వచ్చిన శ్లోకాలతో స్తుతించగా కుండలో వుంచిన చితాభస్మం నుంచి ఆమె పునరుజ్జీవురాలౌతుంది.

బలిచక్రవర్తి వామనుడికి భూమి దానమిచ్చు సమయంలో కన్ను పోగొట్టుకున్న శుక్రాచార్యుడు ఇక్కడి శివుని పూజించి తిరిగి తన నేత్రాన్ని పొందడం జరిగింది.



ఈ విశేషాలన్నింటిని వివిధ పురాణాల్లో వేరు వేరు సందర్భాల్లో ప్రస్తావించడం జరిగింది.



దివ్యమైన పొన్న చెట్టుకింద కొలువు దీరివున్న శ్రీ కపాలేశ్వ రుని లీలలు అనం తరం. ఇక్కడి పొన్న వృక్షాన్ని కల్పవృక్షంగా భావించే భక్తులు దీని కొమ్మలకు ముడుపులు, వుయ్యాలలు కడుతుం టారు. ఆరోగ్యం, వివాహం, సంతానం మొదలైన భక్తుల



కోరికలను ఈ పొన్నచెట్టు తీరుస్తుందని వారి విశ్వాసం.

స్వయంగా ఆ బ్రహ్మదేవుడు ప్రతిష్ఠించి, పార్వతీదేవి పూజించిన శ్రీ కపాలేశ్వరుడు, ఆ పునీత పావన క్షేత్రంలో ఈ లీలనన్నింటికీ ప్రత్యక్షసాక్షిగా వున్న దివ్యమైన పొన్నచెట్టు మనకి అత్యంత చేరువలో అందుబాటులో ఈనాటికీ అలరారుతుండటం మన అదృష్టం. ఈ క్షేత్రాన్ని దర్శించగలిగినవారు పుణ్యాత్ములు.

ఇక్కడ ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగించే వివిధ వాహనాల్లో పొన్నవృక్ష వాహనం కూడా వుండటం విశేషం.





తిరుమల స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సాధారణంగా మనం కల్పవృక్ష వాహనాన్ని చూస్తుంటాం. మన మధ్య పెరిగే చెట్టుకి ఆ పవిత్రమూర్తి వాహనమయ్యే యోగ్యతను పొందడం ఆ వృక్షం యొక్క దివ్యత్వాన్ని, విశిష్టతను మరింత స్పష్టంగా మనకు తెలియచెబుతుంది. మన ప్రాంతంలో సాధారణంగా పెరగగలిగే వృక్షాన్ని మనం ఇప్పటి వరకూ చూడలేకపోవడం, వాటిపట్ల మనకు తగ్గుతున్న ఆదరణను వేలెత్తి చూపిస్తుంది. ఇప్పుడిప్పుడే తిరిగి ఆ లోటును గుర్తించి చెట్ల విశిష్టతను గుర్తించి, వాటిని విరివిగా నాటటం పట్ల అవగాహన, ఆదరణ పెరుగుతుండటం హర్షించదగ్గ విషయం. తమిళనాడులోని మన్నార్గుడిలో వున్న శ్రీ రాజగోపాలస్వామి ఉత్సవాల్లో కూడా పొన్నైమర వాహనం వుండటం విశేషం. అక్కడి స్థలవృక్షం కూడా పొన్నచెట్టే.

మన పూర్వీకులు స్తోత్రాలు, పూజలు, పండుగలు, ఉత్సవాల రూపంలో మనకి అందించగలిగినంత జ్ఞానాన్ని వారి శక్తిమేరకు అందించారు. వాటిని ఒక పక్క సాంప్రదాయబద్ధంగా ఆచరిస్తూ, మరోపక్క వాటిలో దాగివున్న నిగూఢమైన సందేశాన్ని గ్రహించి వాటిని కూడా ఆచరించగలగటం విజ్ఞతతో కూడిన విషయం. (వాహనరూపంలో వున్న ఈ వృక్షాన్ని విరివిగా నాటమని మనకు చెప్పకనే చెబుతుంది.)

ఖనిజ, వృక్ష, జంతు సామ్రాజ్యాలు సమృద్ధిగా, సురక్షితంగా వుంటనే మానవుని, భూమి యొక్క మనుగడ సుదీర్ఘకాలం సస్య శ్యామలంగా వసుధైక కుటుంబంగా వర్ధిల్లగలదని ప్రతిఒక్కరూ గుర్తెరిగి వాటి సంరక్షణ తన ప్రథమ కర్తవ్యంగా స్వీకరించగలిగినరోజు మన పూజలు, నోములు, వ్రతాలు మున్నగు పుణ్యకార్యాలు సంపూర్ణత్వం చెంది, మన చేతలు కేవలం మన వ్యక్తిగత కోరికలకు పరిమితం గాక లోకకల్యాణార్థం అనుసంధానించినప్పుడు మన ప్రతి చర్యా అమృతతుల్యమై అక్షయమౌతుందనటం అతిశయోక్తి కాదు. మన భావితారలకి మనం ఇవ్వగలిగే తరగని ఆస్తి ఇదే.

సరస్వతీదేవికి ఎంతో ప్రీతిపాత్రమైన ఈ పొన్నపువ్వులు విద్యార్జనకు తప్పక సహకరిస్తుందని వేరే చెప్పనవసరం లేదు. సరిపడా చోటు ఉన్న ప్రతి ఇంట్లో, విద్యాలయంలో, దేవాలయంలో, ఉద్యానవనాల్లో విరివిగా పెంచవలసిన అవసరం తప్పనిసరిగా వుంది. సరస్వతీవనం లోని ప్రతి మొక్క జ్ఞానసముపార్జనకు తన వంతు సహకారాన్ని అందిస్తుంది. మన ప్రాంతంలోని ప్రతి పాఠశాల కళాశాల ప్రాంగణాలు ఈ వనాలతో అలరారిన రోజు మన పిల్లలపై చదువుల తల్లి చల్లని చూపు అనుగ్రహం సంపూర్ణంగా వుంటుంది. (పొన్నచెట్టు గురించి మరిన్ని సంగతులు వచ్చే సంచికలో చూద్దాం.)

గమనిక : మన ప్రాంతంలో పొన్న, పున్నాగ అన్న పేర్లతో వేరొక చెట్టుని పిలుస్తుంటారు. దీని పువ్వులు కూడా చక్కటి సువాసన కలిగివుంటాయి. దీన్ని ఆంగ్లంలో 'స్కైలిల్లీ', 'ఇండియన్ కోర్క్ ట్రీ', 'ట్రీ జాస్మిన్' మొదలైన పేర్లతో పిలుస్తారు. తెలుగులో పొన్న, పున్నాగ, సన్నాయి పూలు, అడవిమల్లి, ఆకాశమల్లి అన్న పేర్లు ప్రాచుర్యంలో వున్నాయి. దీని సంస్కృత నామం ఎక్కడా ప్రస్తావించ బడలేదు. ఇది సువాసనాభరిత పువ్వులు గల తోట. చెట్టుగా మనకి విరివిగా కనిపిస్తుంది. కానీ వివిధ గ్రంథాలు పురాణాల్లో వర్ణించి, సూచించిన చెట్టు ఇది కాదు.



మనం ప్రస్తుతం సరస్వతీ వనంలో చెప్పుకుంటున్న పున్నాగ పుష్పాలు ఇవి వేరు వేరు. రామాయణం, మహాభారతం, తదితర పురాణాలు, గ్రంథాల్లో ప్రస్తావించిన పున్నాగవృక్షం దూరం నుంచి చూడటానికి అచ్చం పనసచెట్టు వలె వుంటుంది. ఇప్పుడిప్పుడే దీన్ని తిరిగి తోటల్లోను, రహదార్ల వెంబడి నాటడం గమనించవచ్చు.

**గ్రంథాల్లో ప్రస్తావించిన అసలైన పొన్న / పున్నాగ చెట్టు**



అసలైన పొన్నచెట్టుని గుర్తించి నాటండి. మీ సమీపంలో అటవీ శాఖకు సంబంధించిన నర్సరీల్లో తగు మూల్యానికే ఇవి లభ్యమయ్యే అవకాశం ఎక్కువ.